## హరితాభివృద్ధిపై కీలక చర్చలు

- ఏపీ-గ్రీన్ అభివృద్ధిపై సమావేశం
- పర్యావరణ పరిరక్షణకు సాంకేతికత వినియోగం
- సుస్థిర ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా కార్యాచరణ



**మంగళగిరి, సెప్టెంబర్ 9రాజధాని వాయిస్ :** మంగళగిరిలోని అరణ్యభవన్‌లో ఏపీ-గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ నాగబాబుతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అటవీ శాఖ ఐటీ అడ్వైజర్ పి. నాగబాబు, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు డాక్టర్ సందీప్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో హరితాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణకు సంబంధించి పలు కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఏపీ-గ్రీన్ కార్యక్రమాల విస్తరణ, రాష్ట్రంలో పచ్చదనాన్ని పెంపొందించే చర్యలు, పర్యావ రణ సమతుల్యతను కాపాడే ప్రణాళికలపై సమావేశంలో ప్రధాన ంగా చర్చ జరిగినట్లు వెల్లడించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రజల భాగస్వామ్యాన్ని పెంచే కార్యక్రమాలను మరింత బలోపేతం చేయాలని అభిప్రాయ పడ్డారు.సాంకేతికత ఆధారిత పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరాన్ని సమావేశంలో ప్రస్తావించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ అటవీ సంపద సంరక్షణ, కాలుష్య నియంత్రణ, పర్యావరణ పర్యవేక్షణ వ్యవస్థలను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దే అంశాలపై చర్చించారు. రాష్ట్రంలో హరిత కవచాన్ని విస్తరించేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలు, మొక్కల పెంపకం, పర్యావరణ అవగాహన కార్యక్రమాల నిర్వహణపై కూడా అభిప్రాయాలు పంచుకున్నారు. పర్యావరణ పరిరక్షణలో ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం మరింత పెరగాల్సిన అవసరాన్ని గుర్తించారు. పర్యావరణహిత అభివృద్ధి కార్యక్రమాలను ప్రోత్సహిం చడంతో పాటు భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించే దిశగా చర్యలు చేపట్టాలని సమావేశం లో నిర్ణయిం చారు. ప్రకృతి వనరుల సంరక్షణతో పాటు అభివృద్ధి కార్యక్రమా లు సమతుల్యంగా సాగాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పా రు. హరిత, సుస్థిర ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే లక్ష్యంగా అన్ని సంబం ధిత శాఖలు సమన్వయంతో ముందుకు సాగాలని సమావేశంలో పాల్గొన్న వారు పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణను ప్రజా ఉద్యమంగా మార్చేందుకు భవిష్యత్‌లో మరిన్ని కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.

## పోలీస్ క్రీడల్లో విశాఖ రేంజ్ విజయం

- తొలి ఏపీ స్టేట్ పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో సత్తా
- 338 పతకాలతో ఓవరాల్ ఛాంపియన్‌షిప్
- క్రీడాకారులను అభినందించిన ఐజీ గోపినాథ్ జట్టి



**విశాఖపట్నం, సెప్టెంబర్ 9 రాజధాని వాయిస్ : :** తొలి ఏపీ స్టేట్ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్--2026 పోటీల్లో విశాఖ రేంజ్ పోలీసులు అద్భుత ప్రతిభ కనబరిచి 338 పతకాలతో ఓవరాల్ ఛాంపియ న్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు. సెప్టెంబర్ 1 నుంచి 4 వరకు గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ, మంగళగిరి లోని 6వ బెటాలియన్‌లో నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా 15 విభాగాలకు చెందిన సుమారు 1,900 మంది పోలీసు అధికారులు, క్రీడాకారులు పాల్గొన్నారు. విశాఖ రేంజ్ పరిధిలోని జిల్లాలు, కమిషనరేట్లు కలిసి మొత్తం 197 స్వర్ణ, 82 రజత, 59 కాంస్య పతకాలతో కలిపి 338 పతకాలు సాధించి రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిచాయి. ఈ వివరాలను విశాఖ రేంజ్ ఐజీ గోపినాథ్ జట్టి, సంబంధిత జిల్లాల ఎస్పీలతో కలిసి బుధవారం వెల్లడించారు.జిల్లాల వారీగా చూస్తే విశాఖపట్నం సిటీ 109 పతకాలతో అగ్రస్థానంలో నిలిచింది. విజయనగరం జిల్లా 74 పతకాలు, అనకాపల్లి జిల్లా 70 పతకాలు సాధించగా, శ్రీకాకుళం జిల్లా 33, పార్వతీపురం మన్యం జిల్లా 32, అల్లూరి సీతారామ రాజు జిల్లా 20 పతకాలు సాధించి విశాఖ రేంజ్ విజయంలో కీలక పాత్ర పోషించాయి. ఈ సందర్భంగా ఐజీ గోపినాథ్ జట్టి మాట్లాడుతూ గెలుపు స్ఫూర్తినిస్తే, ఓటమి అనుభవాన్ని నేర్పుతుం దని అన్నారు. పతకాలు సాధించని వారు నిరుత్సాహపడకుండా మరింత పట్టుదలతో సాధన కొనసాగించాలని సూచించారు. పోలీసుశాఖలో అందరూ ఒకే కుటుంబమని, సమష్టి కృషితోనే మెరుగైన సేవలు అందించగలమని పేర్కొన్నారు.మారుతున్న నేరాల స్వరూపాన్ని ఎదుర్కోవడానికి శారీరక దారుఢ్యంతో పాటు మానసిక దృఢత్వం కూడా అవసరమని ఐజీ అన్నారు. ప్రతి పోలీసు సిబ్బంది క్రీడలను తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా మహిళా పోలీసు సిబ్బంది క్రీడల్లో కనబరిచిన ప్రతిభ, అంకితభావాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఆల్ ఇండియా పోలీస్ గేమ్స్‌లో కూడా ఇదే స్థాయిలో రాణించి ఆంధ్రప్రదేశ్‌కు, విశాఖ రేంజ్‌కు మరింత ఖ్యాతి తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం పతకాలు సాధించిన క్రీడాకారులు, పోలీసు సిబ్బందిని ఐజీ గోపినాథ్ జట్టి, వివిధ జిల్లాల ఎస్పీలు ఇతర ఉన్నతాధికారులు అభినందించారు.

## 2027లో పాదయాత్ర చేస్తా: జగన్



నాయుడు ప్రభుత్వ పాలనతో ప్రజలు పోల్చుకుంటున్నారని, తేడాను స్పష్టంగా గమనిస్తున్నారని అన్నారు. వైసీపీ ప్రభుత్వం తన ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీలలో 99 శాతం అమలు చేసి విశ్వసనీయతను నిలబెట్టుకుందని జగన్ పేర్కొన్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ సంతకాలతో హామీ పత్రాలు పంపిణీ చేసినప్పటికీ అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయలేదని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడంలో తమ ప్రభుత్వం విజయవంతమైందని అన్నారు. తమ హయాంలో గ్రామ సచివాలయాలు, వాలంటీర్ వ్యవస్థ ద్వారా పాలనను ప్రజల గడప వద్దకు తీసుకెళ్లామని జగన్ తెలిపారు. లంచాలు, వివక్ష లేకుండా సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేశామని చెప్పారు. ప్రతి ఏడాది బడ్జెట్ సమయంలో సంక్షేమ క్యాలెండర్ ప్రకటించి పథకాల అమలుకు స్పష్టమైన ప్రణాళిక రూపొందించామని పేర్కొన్నారు.విద్య, వైద్య రంగాల్లో చేపట్టిన సంస్కరణలను ఈ సందర్భంగా జగన్ ప్రస్తావించారు. నాడు-నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను ఆధునికీకరించామని, ద్విభాషా పాఠ్యపుస్తకాలు, డిజిటల్ తరగతి గదులు, టోఫెల్ శిక్షణ, ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందించామని చెప్పారు. ఆరోగ్యశ్రీ పరిధిని 1,000 చికిత్సల నుంచి 3,300 చికిత్సలకు విస్తరించి రూ.25 లక్షల వరకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొచ్చామని వివరించారు. గ్రామ క్లినిక్‌లు, ఫ్యామిలీ డాక్టర్ సేవలు, 18 కొత్త వైద్య కళాశాలల ఏర్పాటును కూడా ప్రస్తావించారు.వ్యవసాయ రంగానికి మద్దతుగా రైతు భరోసా కేంద్రాలు, ఈ-క్రాప్ నమోదు, ధరల పర్యవేక్షణ వ్యవస్థలను ప్రవేశపెట్టామని జగన్ తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధరలు అందేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. మరోవైపు ప్రస్తుత ప్రభుత్వం విద్యార్థులకు, మహిళలకు, రైతులకు, నిరుద్యోగులకు ఇచ్చిన పలు హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల అంశంపై కూడా జగన్ స్పందించారు. బీసీ రిజర్వేషన్లు, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను సాకుగా చూపుతూ ప్రభుత్వం ఎన్నికలను వాయిదా వేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిపై కేసులు నమోదు చేసి, పోలీసు వ్యవస్థను దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. రాబోయే రాజకీయ పోరాటాన్ని "కురుక్షేత్ర సంగ్రామం"గా అభివర్ణించిన జగన్, ప్రజలతో కలిసి పార్టీ శ్రేణులు పోరాడాలని పిలుపునిచ్చారు. ఎన్నికలు ఎప్పుడైనా, ఎలాగైనా జరిగినా వైసీపీ ప్రజల పక్షాన నిలుస్తుందని, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగితే పార్టీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

## ఆర్థిక రంగ భవిష్యత్తుకు దిశానిర్దేశం




గ్లోబల్ స్థాయిలో భారత ఫిన్ టెక్ ఎకోసిస్టమ్ సాధించిన గుర్తింపును ప్రస్తావించారు. ఈ ఏడాది ఫెస్ట్ థీమ్ గా పొటెన్షియల్ టు ఇంపాక్ట్: ఏజెంటిక్ ఏఐ, టోకనైజేషన్, క్వాంటమ్ - ట్రస్టెడ్, కనెక్టెడ్, గ్లోబల్ సిస్టమ్స్ ఫర్ ఇంక్లూజివ్ ఫైనాన్స్ అనే అంశాన్ని నిర్ణయించారు. ఆర్థిక రంగ భవిష్యత్తును నిర్దేశించే టెక్నాలజీలపై ఈ ఫెస్ట్ లో ప్రత్యేకంగా చర్చ జరగనుంది. ఏజెంటిక్ ఏఐ ద్వారా ఆటోమేషన్, టోకనైజేషన్ ద్వారా ఆస్తుల డిజిటలైజేషన్, క్వాంటమ్ టెక్నాలజీ ద్వారా సెక్యూరిటీ అంశాలపై గ్లోబల్ పర్స్ పెక్టివ్ తో చర్చలు జరుగుతాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన ప్రసంగంలో ఫిన్ టెక్ రంగం దేశ ఆర్థిక వ్యవస్థకు అందిస్తున్న సహకారాన్ని కొనియాడారు. సామాన్యులకు బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి తేవడంలో డిజిటల్ ఫైనాన్స్ పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఇన్నోవేషన్ తో పాటు ఇంక్లూజన్ ను కూడా ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. భారత ఫిన్ టెక్ స్టార్టప్ లు గ్లోబల్ స్థాయిలో పోటీపడుతున్నాయని తెలిపారు.జీఎఫ్ఎఫ్ 2026 వేదికగా ప్రపంచ దేశాలకు చెందిన ఫిన్ టెక్ నిపుణులు, ఇన్వెస్టర్లు, పాలసీ మేకర్స్ ఒకే చోటకు చేరారు. ఇంక్లూజివ్ ఫైనాన్స్ లక్ష్యంగా కొత్త టెక్నాలజీలు, పాలసీలు, ఇంప్లిమెంటేషన్ మోడల్స్ పై చర్చలు జరగనున్నాయి. డిజిటల్ పేమెంట్స్, లెండింగ్, ఇన్సూరెన్స్, వెల్త్ మేనేజ్ మెంట్ రంగాల్లో వస్తున్న మార్పులపై ప్రత్యేక సెషన్లు నిర్వహిస్తున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ఫెస్ట్ లో పలు ప్యానల్ డిస్కషన్లు, ప్రొడక్ట్ లాంచ్ లు, ఒప్పందాలు జరగనున్నాయి. ఫిన్ టెక్ రంగంలో భవిష్యత్తు అవకాశాలను అందిపుచ్చుకునే దిశగా ఈ ఫెస్ట్ ఒక గ్లోబల్ ప్లాట్ ఫామ్ గా నిలవనుందని నిర్వాహకులు తెలిపారు.

## గరివిడి వెటర్నరీ కళాశాలపై మాట్లాడే నైతిక హక్కు వైసీపీకి లేదు

, కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు కూడా ముందుకు సాగలేదని తెలిపారు. పెండింగ్ బిల్లులను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిష్కరించిందని స్పష్టం చేశారు. గరివిడి వెటర్నరీ కళాశాలలో మౌలిక వసతుల విషయంలో ఎలాంటి ప్రధాన లోపాలు లేవని తాజా వీసీఐ పరిశీలన స్పష్టం చేసిందని అచ్చెన్నాయుడు తెలిపారు. వీసీఐ జూలై 27, 28 తేదీల్లో కళాశాలను తనిఖీ చేసిందని, భవనాలు, ప్రయోగశాలలు, ఇతర మౌలిక వసతులు సంతృప్తికరంగా ఉన్నాయని నివేదికలో పేర్కొన్నట్లు తెలిపారు. ఒక వెటర్నరీ కళాశాలకు వీసీఐ అనుమతులు రావాలంటే ఎలాంటి ప్రమాణాలు పాటించాలో మీకు తెలుసా? ఐదేళ్లలో కళాశాలకు అవసరమైన ల్యాబ్ పరికరాలు సమకూర్చారా? మౌలిక సదుపాయాలు కల్పించారా? అవసరమైన భవనాలు నిర్మించారా? కనీసం ఒక్క బోధనా పోస్టునైనా భర్తీ చేశారా? కేవలం 4 ప్రొఫెసర్లు, 8మంది అసోసియేట్ ప్రొఫెసర్ల కొరత కారణంగానే అనుమతి నిరాకరించబడిందని తెలిపింది. ఇది కూడా వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఏర్పడిన సమస్య కాదా? అని మంత్రి ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అవసరమైన ప్రయోగశాల పరికరాలు సమకూర్చడంతో పాటు అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, క్లినికల్ కాంప్లెక్స్, బాలురు, బాలికల వసతిగృహాల నిర్మాణ పనులను పూర్తి చేసిందన్నారు. వీసీఐ ప్రమాణాలకు అనుగుణంగా దాదాపు 99 శాతం మౌలిక వసతుల పనులు పూర్తయ్యాయని తెలిపారు. కళాశాలలో సిబ్బంది కొరతను పూర్తిగా పరిష్కరించేందుకు ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు కలిపి మొత్తం 253 బోధనా పోస్టుల భర్తీకి ఆర్థిక శాఖ అనుమతి పొందామని మంత్రి తెలిపారు. ఇప్పటికే వీసీఐ సూచనల మేరకు కాంట్రాక్ట్ అధ్యాపకులను నియమించి మొత్తం బోధనా సిబ్బంది సంఖ్యను 77కు పెంచామని చెప్పారు. కొన్ని సాంకేతిక కారణాల వల్ల రెగ్యులర్ నియామక ప్రక్రియలో ఆలస్యం జరిగిందని, అయితే ఆరు నెలల్లో నియామక ప్రక్రియను పూర్తి చేసి వీసీఐ అనుమతులను పునరుద్ధరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడటం గత ప్రభుత్వానికి అలవాటుగా మారిందని మంత్రి మండిపడ్డారు. గత పాలనలో వదిలివేసిన సమస్యలను కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా పరిష్కరిస్తోందన్నారు. తాము చేసిన తప్పులకు కూడా కూటమి ప్రభుత్వాన్ని బాధ్యులను చేస్తే ప్రజలు నమ్ముతారని వైసీపీ నేతలు భావించవద్దని హెచ్చరించారు. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని, ఎవరు ఏం చేశారో ప్రజలకు తెలుసన్నారు. గరివిడి వెటర్నరీ కళాశాలకు వీసీఐ అనుమతుల పునరుద్ధరణ కోసం ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని తెలిపారు. అవసరమైన బోధనా సిబ్బంది నియామకాలను పూర్తి చేసి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తామని స్పష్టం చేశారు. ఇకనైనా వైసీపీ నేతలు విమర్శలు చేసే ముందు తమ ఐదేళ్ల పాలనను ఒకసారి ఆత్మపరిశీలన చేసుకోవాలని అచ్చెన్నాయుడు సూచించారు.

# ప్రతి వారమూ ప్రజల మధ్యలోనే

తెలుసుకుంటున్నానని అన్నారు. ప్రతి నెలా మూడో శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కింద నాలుగో శనివారం హాజరవుతున్నట్టు సీఎం వివరించారు. పీ4తో సామాజిక బాధ్యత కింద ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. అభివృద్ధి చేస్తేనే సంపద సృష్టికి ఆస్కారం ఉంటుందని జీవన ప్రమాణాలు పెంచి అంతా గౌరవంగా జీవించేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

**భూమికి భద్రత ఇచ్చేలా**

ప్రతీ నెలా 9 తేదీనే మీ భూమి- మీ హక్కు కార్యక్రమానికి హాజరై రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేస్తున్నామని అన్నారు. భూమిపై రైతులు, యజమానులకు హక్కులు కల్పించేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గత పాలకులు రెవెన్యూ రికార్డులు తారుమారు చేసి వ్యవస్థను ధ్వంసం చేశారని అన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు తెచ్చి ప్రజల భూముల్ని కాజేసే ప్రయత్నం చేశారని ఆక్షేపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ చట్టాన్ని రద్దు చేసేశామని తెలిపారు. గత పాలకులు రీసర్వే పేరుతో అనేక ఘోరాలు, నేరాలు, పాపాలు చేశారని.. పూర్వీకుల నుంచి వచ్చిన వారసత్వ భూములపై కూడా తమ ఫోటోలు వేసుకున్నారని అన్నారు. సర్వే రాళ్లపై బొమ్మలు వేసుకునే పిచ్చి ఏమిటో ఎవరికీ అర్ధం కాలేదన్నారు. ఇష్టం లేని వ్యక్తుల భూముల్ని, ఆస్తుల్ని 22ఏ జాబితాలో చేర్చి ఇబ్బందులు పెట్టారన్నారు. అందుకే పటిష్టంగా రీసర్వే ప్రక్రియను పూర్తి చేసి ఎక్కడా అవకతవకలు లేకుండా రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను ఇస్తున్నామన్నారు. ఈ-కేవైసీ, క్యూఆర్ కోడ్ , బ్లాక్ చెయిన్ టెక్నాలజీ లాంటి భద్రతా ఫీచర్లను పెట్టి పట్టాదారు పాస్ పుస్తకాలను జారీ చేస్తున్నామని అన్నారు.

**రెవెన్యూ సంస్కరణలు**

భూమికి భద్రత ఇవ్వటమే కూటమి ప్రభుత్వ అజెండా అని సీఎం స్పష్టం చేశారు. ఇప్పటి వరకూ 8234 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి 36 లక్షల రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు ఇచ్చినట్టు సీఎం వివరించారు. వచ్చే మార్చి నాటికి 8,582 గ్రామాల్లో 56 లక్షల పాస్ పుస్తకాలు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. రిజిస్ట్రేషన్ జరిగిన వెంటనే ఆటో మ్యూటేషన్ సేవల్ని అందుబాటులోకి తెచ్చామని అన్నారు. వారసత్వ భూముల విభజనలో స్టాంప్ డ్యూటీని రూ.వెయ్యికే పరిమితం చేశామని అన్నారు. 1.25 లక్షల కుటుంబాలకు ప్రయోజనం కలిగిందన్నారు. తప్పులు సరిచేసి 16 లక్షల ఎకరాలను 22ఏ జాబితా నుంచి తొలగించి సమస్యను పరిష్కరించామని వివరించారు. శెట్టిపల్లి కంగుంది, వట్టి చెరుకూరు, ముదినేపల్లి లాంటి చోట్ల దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న 244 కీలక భూ సమస్యలకు విముక్తి కల్పించామని అన్నారు. అమలాపురంలోని మాచవరం, ముమ్మిడివరం, రామచంద్రాపురం లో బ్రిటీష్ కాలంలో 1908 నుంచి 22 ఏ1 కింద భూములు నిషేధంలో ఉన్నాయని ఈ సమస్యను కూడా పరిష్కరిస్తున్నట్టు ముఖ్యమంత్రి తెలిపారు. 56.37 ఎకరాల భూమిని 1410 మందికి లబ్ది కలిగేలా చర్యలు తీసుకున్నామని ముఖ్యమంత్రి ప్రకటించారు. గొడ్డలి పార్టీ చేసిన తారుమారు చేసిన రికార్డుల్ని ప్రక్షాళన చేసి భూ సమస్యల్ని కొలిక్కి తెస్తున్నామని సీఎం వివరించారు.

**నిత్యం ప్రజల గురించే తపన**

నీటి భద్రతకు, భూమి భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని ముఖ్యమంత్రి వెల్లడించారు. రాష్ట్రంలో తీవ్రమైన ఎల్ నినో ప్రభావం ఉన్నప్పటికీ గోదావరి నుంచి ఈ ఏడాది వెయ్యి టీఎంసీలకు పైగా నీరు సముద్రంలోకి వెళ్లిందన్నారు.ఆ నీటిని వినియోగించుకుంటే రాష్ట్రానికి



ప్రయోజనం కలిగేదని అన్నారు. గత పాలకుల నిర్లక్ష్యంతో డయాఫ్రామ్ వాల్ కొట్టుకు పోయిందని.. రాజకీయ కక్షతో కాంట్రాక్టర్ని మార్చటంతో ప్రాజెక్టు ఆలస్యమైందని స్పష్టం చేశారు. 2024లో కూటమి ప్రభుత్వానికి ప్రజలు ఇచ్చిన మద్దతు ఢిల్లీలోనూ సంజీవనిగా పనిచేసిందని రాష్ట్రానికి ఎక్కువ నిధులు తెచ్చుకోగలుగుతున్నట్టు వివరించారు. ప్రజలకు మరింతగా మేలు చేసే అంశంపై రెండు రోజుల పాటు సమావేశం నిర్వహించి ఎమ్మెల్యేలకూ దిశానిర్దేశం చేశామన్నారు. జిల్లా కలెక్టర్లతోనూ సమావేశాలను నిర్వహించి క్షేత్రస్థాయిలో పౌరసేవల్ని అందించే అంశంపై స్పష్టంగా ఆదేశాలు ఇస్తున్నామని అన్నారు. కూటమి ప్రభుత్వం ఇన్ని రకాల ఆలోచనలతో ప్రజలకు మేలు చేస్తుంటే గొడ్డలి పార్టీ నిత్యం కుట్రలు పన్నుతూ అభివృద్ధిని అడ్డుకుంటోందని ముఖ్యమంత్రి ఆక్షేపించారు. అంతకు ముందు తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఈపీడీసీఎల్ రూ.240 కోట్ల వ్యయంతో చేపట్టిన 3 ఫేజ్ కరెంటు ఇచ్చేలా గ్రిడ్ ఆధునీకరణ పనులకు సంబంధించి శిలాఫలకాన్ని సీఎం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్, వాసంశెట్టి సుభాష్, ఎంపీ గంటి హరీష్, స్థానిక ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తదితరులు హాజరయ్యారు.

## ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించిన ఏపీ వక్ఫ్ బోర్డు

**అమరావతి, సెప్టెంబర్ 09 రాజధాని వాయిస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డు చరిత్రలో మరో అరుదైన ఘనత నమోదైంది. పేద, ప్రతిభావంతమైన ముస్లిం విద్యార్థులకు నాణ్యమైన ఉచిత రెసిడెన్షియల్ విద్యను అందించేందుకు చేపట్టిన ప్రతిష్టాత్మక తాలీమ్-ఎ-హునర్ కార్యక్రమానికి అంతర్జాతీయ గుర్తింపు లభించింది. ఈ కార్యక్రమాన్ని గుర్తిస్తూ ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డును అధికారికంగా రికార్డ్ హోల్డర్ గా ప్రకటించింది. మోస్ట్ మెరిటోరియస్ స్టూడెంట్స్ గాట్ ఫ్రీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ (మాస్) విభాగంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డు పేరును సంస్థ తన అధికారిక రికార్డుల్లో నమోదు చేసి, ఇందుకు సంబంధించిన వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లోనూ ప్రచురించింది. ఈ సందర్భంగా ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ, వక్ఫ్ బోర్డు విద్యా రంగంలో చేపట్టిన తాలీమ్-ఎ-హునర్ కార్యక్రమానికి అంతర్జాతీయ గుర్తింపు రావడం ఎంతో గర్వకారణం. ఆర్థిక పరిస్థితి కారణంగా ప్రతిభావంతులైన విద్యార్థుల కలలు ఆగిపోకూడదనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాం. ఇప్పుడు ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ఏపీ వక్ఫ్ బోర్డు అధికారిక రికార్డ్ హోల్డర్‌గా స్థానం సంపాదించడం మా కృషికి లభించిన గొప్ప గుర్తింపు అని తెలిపారు. ఈ విజయం కేవలం వక్ఫ్ బోర్డుదే కాదు. తాలీమ్-ఎ-హునర్ ద్వారా కొత్త భవిష్యత్తును నిర్మించుకుంటున్న ప్రతి విద్యార్థిదీ. ఈ గుర్తింపు మాపై మరింత బాధ్యతను పెంచింది. విద్య, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో మరిన్ని వినూత్న కార్యక్రమాలను చేపట్టి పేద, ప్రతిభావంతమైన విద్యార్థులకు అండగా నిలుస్తాం" అని అబ్దుల్ అజీజ్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, మంత్రి నారా లోకేశ్, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ ప్రోత్సాహం, సహకారంతో వక్ఫ్ బోర్డు విద్యా సాధికారతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని ఆయన తెలిపారు. ఈ అంతర్జాతీయ గుర్తింపు సాధనలో కృషి చేసిన వక్ఫ్ బోర్డు సభ్యులు, అధికారులు, సిబ్బంది, పరీక్షల నిర్వహణలో భాగస్వాములైన అధికారులు, విద్యాసంస్థలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, సహకరించిన ప్రతి ఒక్కరికీ చైర్మన్ అబ్దుల్ అజీజ్ అభినందనలు తెలిపారు. ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డు అధికారిక 'రికార్డ్ హోల్డర్'గా నమోదు కావడం బోర్డు చరిత్రలో చిరస్థాయిగా నిలిచే మైలురాయిగా అభివర్ణించారు.

# జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి

**- ఏపీఐజేఏ రాష్ట్ర అధ్యక్షుడు ఎం. రాజా డిమాండ్**

**మాచర్ల.సెప్టెంబర్ 09 రాజధాని వాయిస్** :మీడియా రంగంలో అర్హత, అనుభవం లేని వ్యక్తులు కొందరు ప్రవేశించడం వల్ల జర్నలిజం ప్రతిష్ఠ దెబ్బతింటోందని ఆంధ్రప్రదేశ్ ఇండిపెండెంట్ జర్నలిస్టు అసోసియేషన్ (ఏపీఐజేఏ) రాష్ట్ర అధ్యక్షుడు, ఎంఆర్ఆర్ న్యూస్ మేనేజింగ్ డైరెక్టర్ యం. రాజా ఆందోళన వ్యక్తం చేశారు. మాచర్లలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎండనకా వాననకా నిరంతరం ప్రజా సమస్యలను వెలుగులోకి తెస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు తగిన గౌరవం, గుర్తింపు దక్కడం లేదన్నారు. మీడియా సంస్థలు జర్నలిజం విలువలను పాటిస్తూ అసత్య ప్రచారాలకు దూరంగా ఉండాలని సూచించారు. జర్నలిస్టులకు బస్సు, రైల్వే, అసెంబ్లీ మీడియా గ్యాలరీ, టోల్‌గేట్ పాస్‌లతో పాటు కుటుంబ సభ్యులకు హెల్త్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. జర్నలిస్టు ఇన్సూరెన్స్ గడువును ఐదేళ్లకు పెంచి, విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మరణించిన జర్నలిస్టు కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని, 50 ఏళ్లు దాటిన సీనియర్ జర్నలిస్టులకు నెలకు రూ.25 వేల పెన్షన్, వాహనాలు, వీడియో కెమెరాల కొనుగోలుపై 50 శాతం సబ్సిడీ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. అర్హులైన ప్రతి వర్కింగ్ జర్నలిస్టుకూ అక్రిడిటేషన్ కార్డు మంజూరు చేయాలని, క్షేత్రస్థాయి పరిశీలన లోపాల వల్ల అర్హులకు



అన్యాయం జరగకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌లను కోరారు.

# ఓటర్ల ఫొటోల అప్‌లోడ్, ఫారాల పరిష్కారం వేగవంతం చేయాలి కలెక్టర్ వినోద్ కుమార్

**బాపట్ల. సెప్టెంబర్ 09 రాజధాని వాయిస్** :ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ఓటర్ ఫొటో అప్‌లోడ్ ప్రక్రియను ఎక్కడా పెండింగ్ లేకుండా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ బీఎల్ఓలను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ వీసీ హాల్ నుంచి సార్వత్రిక, పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల సన్నద్ధతపై ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, బీఎల్ఓలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఫొటోలు సరిగా లేనిచోట తాజా ఫొటోలు సేకరించి అప్‌లోడ్ చేయాలని, 6, 7, 8 ఫారాలతో పాటు ఎన్‌జీఎస్పీ దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. పర్చూరు, చీరాల, వేటపాలెం, రేపల్లె మండలాల్లో దరఖాస్తులు పెండింగ్ ఉండటంపై ఆరా తీస్తూ మండల ప్రత్యేక అధికారులు హియరింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. పంచాయతీ ఎన్నికలకు సంబంధించి క్రిటికల్ పోలింగ్ కేంద్రాల వివరాలను వెంటనే నివేదించాలని ఎంపీడీవోల



ను ఆదేశించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ ప్రకారం సెప్టెంబర్ 11న ఓటర్ల జాబితాను పారదర్శకంగా ప్రచురిస్తామని, ఎంపీటీసీ జాబితాలు మండల పరిషత్ కార్యాలయాల్లో, జడ్పీటీసీ జాబితాలు జిల్లా పరిషత్ కార్యాలయంలో అందుబాటులో ఉంటాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమీక్షలో ఇన్‌చార్జి డీఆర్వో లవన్న, జిల్లా పంచాయతీ అధికారి ఎల్. ప్రభాకర్ రావు, కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకులు షఫీ తదితరులు పాల్గొన్నారు.

# సాగునీటికోసం కదం తొక్కిన రైతులు

- శ్రీశైలం నుంచి సోమశిలకు నీరు విడుదల చేయాలని డిమాండ్
- నెల్లూరు బ్యారేజ్ వద్ద వైసీపీ ఆధ్వర్యంలో భారీ ధర్నా
- రైతుల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని డిమాండ్





**నెల్లూరు, సెప్టెంబర్ 8రాజధాని వాయిస్ :** : శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా రైతాంగానికి సాగునీరు, తాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నెల్లూరు బ్యారేజ్ వద్ద భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. మాజీ మంత్రి, జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి నాయకత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సాకే శైలజానాథ్, నెల్లూరు రూరల్ ఇన్‌చార్జి ఆనం విజయ్ కుమార్ రెడ్డి, గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త బూదూరు గురవయ్య, పార్టీ నాయకులు, రైతులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శ్రీశైలం నుంచి సోమశిల జలాశయానికి వెంటనే నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయం నుంచి నెల్లూరు బ్యారేజ్ వరకు వందలాది కార్లు, ద్విచక్ర వాహనాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. బ్యారేజ్ వద్దకు చేరుకున్న రైతులు, పార్టీ నాయకులను పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సందర్భంగా పోలీసులతో వాగ్వాదానికి దిగిన కాకాణి గోవర్ధన్ రెడ్డి రైతులతో కలిసి రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పోలీసులు అనుమ తించకపోయినా రైతులు, నాయకులతో కలిసి బ్యారేజ్ ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడిన కాకాణి గోవర్ధన్ రెడ్డి, శ్రీశైలంలో తగినంత నీరు ఉన్నప్పటికీ సోమశిల జలాశయానికి నీటిని విడుదల చేయకపోవడం రైతాంగంపై తీవ్ర అన్యాయమని ఆరోపించారు. ప్రస్తుతం సోమశిలలో కేవలం 17 టీఎంసీలు, కండలేరు జలాశయంలో 18 టీఎంసీల నీరు మాత్రమే ఉందని పేర్కొన్నారు. నెల్లూరు డెల్టా రైతులకు సాగు, తాగునీరు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. నీటి కొరత కారణంగా పంటలు ఎండిపోతున్నాయని, రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని తెలిపారు. కలువాయి మండలంలోని కనుపూరుపల్లి, నూకనపల్లి, యదనపర్తి, వెరుబొట్లపల్లి, గోపవరం తదితర గ్రామాల్లో వేల ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయని కాకాణి పేర్కొన్నారు. సోమశిల--కండలేరు ఫ్లడ్ కెనాల్ ద్వారా ఒక్కరోజు నీటిని విడుదల చేసినా చెరువులు నిండిపోయే అవకాశం ఉందన్నారు. రైతులకు ఉన్న నీటి హక్కులను ప్రభుత్వం గౌరవించాలని డిమాండ్ చేశారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ పంటలు, సాగునీటి ప్రణాళికలపై ప్రభుత్వం సమీక్షలు నిర్వహించాల్సి ఉందన్నారు.తెలంగాణ ప్రభుత్వం నీటిని వినియోగిస్తున్నప్పటికీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్పందించడం లేదని కాకాణి విమర్శించారు. జలాశయాల నీటిమట్టాల వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచకుండా దాచిపెడుతున్నారని ఆరోపించారు. రైతుల సమస్యలను పరిష్కరించాల్సింది పోయి ప్రశ్నించే వారిపై పోలీసు యంత్రాంగాన్ని ప్రయోగిస్తున్నారని మండిపడ్డారు. రైతుల సంక్షేమం కంటే ఇతర ప్రయోజనాలకే ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఆరోపించారు. నెల్లూరు బ్యారేజ్‌కు వైఎస్ రాజశేఖరరెడ్డి పునాది వేయగా, వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పూర్తి చేశారని కాకాణి గుర్తు చేశారు. మాజీ మంత్రి నల్లపరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, మేకపాటి గౌతమ్ రెడ్డి పేర్లను ప్రాజెక్టుల నుంచి తొలగించడం సరికాదన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అక్రమ కేసులు, అరెస్టులకు భయపడబోమని, రైతాంగ ప్రయోజనాల కోసం పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# బ్రహ్మోత్సవాలపై డ్రైవర్లకు అవగాహన సదస్సు

**రాజధాని వాయిస్ తిరుపతి, సెప్టెంబర్ 9 :** శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్స వాలు--2026 నేపథ్యంలో తిరుపతి జిల్లా పోలీస్ శాఖ ఆటో, జీప్, క్యాబ్ డ్రైవర్లకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించింది. బ్రహ్మోత్సవాల సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు తిరుపతికి తరలివచ్చే నేపథ్యంలో వారికి సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించడంతో పాటు నగరంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. సదస్సులో పాల్గొ న్న పోలీసు అధికారులు డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. భక్తుల తో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, నిర్ణయించిన చార్జీలకే సేవలు అందించాలని సూచించారు. ప్రయాణికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు.బ్రహ్మోత్సవాల సమయంలో రద్దీ అధికంగా ఉండే ప్రాంతాల్లో వాహనాలను క్రమపద్ధతిలో నడపాలని అధికారులు తెలిపారు. ముఖ్యంగా ఆలయ పరిసర ప్రాంతాలు, బస్ స్టాండ్లు, రైల్వే స్టేషన్లు, పార్కింగ్ కేంద్రాల వద్ద ట్రాఫిక్ సిబ్బం దికి సహకరించాలని సూచించారు. రహదారులపై అనవసరంగా వాహనాలను నిలిపివేయరాదని హెచ్చరించారు. భక్తులకు సరైన సమాచారం అందించడంలో డ్రైవర్లు కీలక పాత్ర పోషించగలరని అధికారులు పేర్కొన్నారు. దర్శనం, వసతి, పార్కింగ్, రవాణా సదుపాయాల గురించి తెలిసిన సమాచారాన్ని భక్తులకు అందించి వారికి సహాయపడాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.రోడ్డు భద్రతా నిబంధనలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారిం చవచ్చని అధికారులు వివరించారు. అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రయాణికుల ప్రాణ భద్రతను దృష్టిలో ఉంచుకుని బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు.

# మైలవరంలో ఆలయ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి

- రూ.4 కోట్లతో నిర్మించిన కల్యాణ మండపం ప్రారంభం
- ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని వెల్లడి
- మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి





**మైలవరం రాజధాని వాయిస్ :** ఎన్టీఆర్ జిల్లా మైలవరం నియోజకవర్గంలో పర్యటించడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. పర్యటనలో భాగంగా ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి దత్తత ఆలయమైన మైలవరం శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. ఆలయ దర్శనం అనంతరం వేద పండితుల ఆశీర్వచనాలు స్వీకరించిన మంత్రి, ఆధ్యాత్మిక వాతావరణం తనకు విశేష అనుభూతిని కలిగించిందన్నారు. భక్తుల ఆధ్యాత్మిక అవసరాలను తీర్చే కేంద్రాలుగా దేవాలయాలు నిలుస్తున్నాయని, వాటి పరిరక్షణతో పాటు అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని వివరించారు.తదుపరి మైలవరంలో సుమారు రూ.4 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మండపాన్ని స్థానిక శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్‌తో కలిసి ఘనంగా ప్రారంభించారు. ఈ కల్యాణ మండపం ద్వారా భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి స్పష్టం చేశారు. దేవాలయాలకు వచ్చే భక్తులకు అవసరమైన మౌలిక వసతులు, తాగునీరు, పారిశుధ్యం, విశ్రాంతి సదుపాయాలు, ఇతర సౌకర్యాలను కల్పించేందుకు ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నామని చెప్పారు.ఆధ్యాత్మిక పర్యాటకాన్ని ప్రోత్సహించడంతో పాటు ఆలయాల ఆర్థిక బలోపేతానికి కూడా ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రముఖ, చిన్న దేవాలయాలన్నింటినీ అభివృద్ధి పథంలో నడిపించేలా చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, దేవాదాయ శాఖ అధికారులు, స్థానిక నాయకులు, భక్తులకు మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సహకారంతో ఆలయాల అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగవంతం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

# శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు

- సాలకట్ల, నవరాత్రి బ్రహ్మోత్సవాల బుక్లెట్ ఆవిష్కరణ
- భక్తుల కోసం ఉత్సవాల పూర్తి వివరాల విడుదల
- వైభవంగా నిర్వహణకు టీటీడీ ఏర్పాట్లు



**రాజధాని వాయిస్ తిరుమల:** తిరుమల శ్రీవారి సాలకట్ల, నవరాత్రి బ్రహ్మోత్సవాల నిర్వహణకు టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. ఈ నేపథ్యంలో 2026 సంవత్సరానికి సంబంధించిన బ్రహ్మోత్సవాల బుక్లెట్‌ను తిరుమల అన్నమయ్య భవనంలో జరిగిన టీటీడీ పాలకమండలి సమావేశం సందర్భంగా ఆవిష్కరించారు. బ్రహ్మోత్సవాల నిర్వహణ, వాహన సేవలు, ప్రత్యేక ఉత్సవాల వివరాలను భక్తులకు అందుబాటులో ఉంచేందుకు ఈ బుక్లెట్‌ను రూపొందించారు.టీటీడీ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం సాలకట్ల బ్రహ్మోత్సవాలు సెప్టెంబర్ 15 నుంచి 23 వరకు జరగనున్నాయి. అనంతరం నవరాత్రి బ్రహ్మోత్సవాలు అక్టోబర్ 12 నుంచి 20 వరకు నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాల సందర్భంగా తిరుమలకు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. బ్రహ్మోత్సవాల్లో నిర్వహించే వాహన సేవలు, విశేష పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాల సమగ్ర వివరాలను బుక్లెట్‌లో పొందుపరిచారు. భక్తులు ముందుగానే ఉత్సవాల షెడ్యూల్‌ను తెలుసుకొని తమ యాత్రను సౌకర్యవంతంగా ప్రణాళిక చేసుకునేందుకు ఇది ఉపయోగపడుతుందని టీటీడీ అధికారులు తెలిపారు. కలియుగ ప్రత్యక్ష దైవంగా భక్తులచే ఆరాధించబడుతున్న వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు టీటీడీ వెల్లడించింది. దర్శనం, వసతి, తాగునీరు, పారిశుధ్యం, రవాణా, భద్రత వంటి అంశాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొంది.భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అదనపు సిబ్బంది నియామకం, క్యూలైన్ల నిర్వహణ, వైద్య సేవలు, సమాచార కేంద్రాల ఏర్పాటు వంటి అంశాలపై కూడా టీటీడీ ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ఉత్సవాల సమయంలో భక్తులకు సౌకర్యవంతమైన సేవలు అందించడమే లక్ష్యంగా సమగ్ర కార్యాచరణ రూపొందించినట్లు అధికారులు తెలిపారు. ప్రపంచ నలుమూలల నుంచి వచ్చే భక్తుల ఆధ్యాత్మిక అనుభూతిని మరింతగా పెంచేలా బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నట్లు టీటీడీ పేర్కొంది. భక్తిశ్రద్ధలతో జరిగే ఈ మహోత్సవాల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని భక్తులను ఆహ్వానించింది. గోవింద నామస్మరణతో తిరుమల క్షేత్రం మరోసారి ఆధ్యాత్మిక శోభను సంతరించుకోనుంది.

# సాగరతీర గణపతికి ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి

- మంగినపూడి బీచ్‌లో ఉత్సవ ఏర్పాట్ల పరిశీలన
- భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచన
- పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యం
- మంత్రి కొల్లు రవీంద్ర





**రాజధాని వాయిస్ మచిలీపట్నం, సెప్టెంబర్ 9 :** మచిలీపట్నంలోని మంగినపూడి సముద్రతీరంలో ఏర్పాటు చేస్తున్న సాగర తీర మహాగణపతి ఉత్సవాల ఏర్పాట్లను మంత్రి కొల్లు రవీంద్ర కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించారు. వినాయక చవితి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు చేపడుతున్న ఏర్పాట్ల పురోగతిని సమీక్షిస్తూ పలు సూచనలు చేశారు. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు చేపట్టాలని నిర్వాహకులను ఆదేశించారు. ఉత్సవాలకు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున తాగునీరు, ఆహారం, పారిశుధ్యం వంటి మౌలిక సదుపాయాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మంత్రి సూచించారు. భక్తుల సౌకర్యమే ప్రధాన లక్ష్యంగా అన్ని ఏర్పాట్లు ఉండాలని, అవసరమైన చోట అదనపు సదుపాయాలు కల్పించాలని పేర్కొన్నారు. రద్దీని సమర్థంగా నియంత్రించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. సముద్రతీర ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న స్టాల్స్, ఇతర సదుపాయాలను మంత్రి పరిశీలించారు. రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటడం ద్వారా ఆహ్లాదకర వాతావరణం కల్పించేందుకు చేపడుతున్న చర్యల ను అభినందించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూనే ఉత్సవాలను ఆకర్షణీయంగా నిర్వహించాలని సూచించారు. మంగినపూడి సముద్రతీరానికి మరింత శోభ తీసుకొచ్చేలా వినాయ క చవితి ఉత్సవాలను నిర్వహించాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. ఆధ్యాత్మికతతో పాటు పర్యాటక అభివృద్ధికి కూడా ఈ ఉత్సవాలు దోహదపడేలా ప్రణాళికలు రూపొంది స్తున్నామని చెప్పారు. భక్తులకు ప్రత్యేక అనుభూతిని కలిగించేలా కార్యక్రమా లను నిర్వహించను న్నట్లు వెల్లడించారు.భవిష్యత్తులో మచిలీపట్నాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక, సాంస్కృతిక కేంద్రంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఈ దిశగా మంగినపూడి బీచ్ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో ఒకటిగా మంగినపూడిని తీర్చిదిద్దేందుకు చర్యలు కొనసాగుతున్నాయని వివరించారు. సాగర తీర మహాగణపతి ఉత్సవాలు విజయవంతం కావడానికి ప్రజల సహకారం అవసరమని మంత్రి కోరారు. భక్తులు ఉత్సవాల్లో పాల్గొని ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందాలని ఆకాంక్షించారు ఎలాంటి లోటుపాట్లు లేకుండా అధికారులు, నిర్వాహకులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు

## పరిశ్రమల స్థాపన వేగవంతం చేయాలి

**రాజధాని వాయిస్ కర్నూలు, సెప్టెంబర్ 9 :** పరిశ్రమల స్థాపనకు సంబంధించి అవగాహన ఒప్పందాలు (ఎంఓయూలు) పూర్తి చేసుకున్న సంస్థలను వీలైనంత త్వరగా కార్యరూపంలోకి తీసుకురావాలని ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ ఆదేశించారు. విజయవాడ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించడంతో పాటు ఉపాధి అవకాశాలు పెంచేందుకు పరిశ్రమల స్థాపన ప్రక్రియను వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని ప్రధాన కార్యదర్శి పేర్కొన్నారు. ఎంఓయూలు కుదుర్చుకున్న పరిశ్రమలు భూమిపైకి వచ్చేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూమి, రహదారులు, విద్యుత్, నీటి సరఫరా వంటి మౌలిక సదుపాయాలను సమయానికి అందించాలని అధికారులను ఆదేశించారు. పెట్టుబడిదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పరిశ్రమల స్థాపనలో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని ప్రధాన కార్యదర్శి తెలిపారు. అనుమతుల జారీ, భూ కేటాయింపు, మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాల్లో ఆలస్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో పరిశ్రమల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని, ఎంఓ యూలు పూర్తైన ప్రతి ప్రాజెక్టు స్థితిగతులను సమీక్షించాలని అధికారు లకు సూచించారు. పెట్టుబడులు కార్యరూపం దాల్చేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని చెప్పారు. పరిశ్రమల ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, జిల్లా ఆర్థికాభివృద్ధికి దోహదపడుతాయని సమావేశంలో అభిప్రాయపడిన అధికారులు, ప్రధాన కార్యదర్శి ఆదేశాలకు అనుగుణంగా చర్యలు చేపడతామని తెలిపారు

## మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన శివారెడ్డి



పిడుగురాళ్ల.సెప్టెంబర్ 09రాజధాని వాయిస్ :గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డికి అయ్యప్ప నగర్ మాజీ సర్పంచ్ గొట్టిముక్కల శివారెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని కాసు మహేష్ రెడ్డి నివాసానికి వెళ్లిన శివారెడ్డి, ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి హృదయపూర్వక శుభాకాంక్షలు అందజేశారు. భగవంతుని ఆశీస్సులతో ఆయన ఆయురారోగ్యాలతో, నిండు నూరేళ్లు ప్రజాసేవలో కొనసాగాలని సందర్భంగా శివారెడ్డి ఆకాంక్షించారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా పోషణ్ మాసం




మాచర్ల.సెప్టెంబర్ 09రాజధాని వాయిస్ : స్థానిక 4వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ మాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్య పరిరక్షణకు సమతుల్య పౌష్టికాహారం ఎంత కీలకమో అవగాహన కల్పిస్తూ ప్రత్యేక పోషకాహార ప్రదర్శనను ఏర్పాటు చేశారు. చిన్నారుల సరైన శారీరక ఎదుగుదలకు పోషకాలు ఎంతగానో తోడ్పడతాయని, తల్లిదండ్రులు వారి ఆహారం విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో కృష్ణవేణి, సూపర్‌వైజర్ దుర్గ, అంగన్‌వాడీ కార్యకర్తలు సుందర లీల, కమల, జయలక్ష్మి, సహాయకులు, స్థానిక గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

## కారంపూడిలో నిజం గెలిచింది కార్యక్రమం



కారంపూడి.సెప్టెంబర్ 09 రాజధాని వాయిస్ :స్థానిక బస్టాండ్ సెంటర్‌లో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నిజం గెలిచింది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టు జరిగి నేటికి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా టీడీపీ నాయకులు, శ్రేణులు కొవ్వొత్తులు వెలిగించి సంఘీభావం తెలియజేశారు. అక్రమ కేసులను ఎదుర్కొని చివరకు న్యాయమే గెలిచిందని నేతలు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి టీడీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## గర్భిణులకు మాగులూరి ఫౌండేషన్ పౌష్టికాహార వితరణ



మాగులూరి. భాను ప్రకాష్

పెదకూరపాడు.సెప్టెంబర్ 09రాజధాని వాయిస్ :ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పరీక్షల కోసం వచ్చే గ్రామీణ గర్భిణులకు మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఎన్నారై మాగులూరి భానుప్రకాష్ సహకారంతో పెదకూరపాడు, 75 తాళ్లూరు పీహెచ్‌సీలతో పాటు సత్తెనపల్లి మండలం ఫణిదంలో రాగిజావ, గుడ్లు, పండ్లు, భోజనం అందజేశారు. ఏళ్ల తరబడి భానుప్రకాష్ చేస్తున్న ఈ సేవలను వైద్యులు, స్థానికులు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ సుధారాణి, డాక్టర్ ఆదిత్య, డాక్టర్ శివలీల, ఫౌండేషన్ ప్రతినిధులు కిరణ్ కుమార్, కృష్ణారావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# పర్యాటకాభివృద్ధికి పటిష్టమైన అడుగులు

### ఎత్తిపోతల జలపాతానికి ప్రత్యేక ఆకర్షణగా జిప్ రైడ్ ప్రారంభించిన జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, జూలకంటి







మాచర్ల.సెప్టెంబర్ 09 రాజధాని వాయిస్ : కూటమి ప్రభుత్వ హయంలో పల్నాడు జిల్లా, మాచర్ల నియోజకవర్గ పరిధిలో పర్యాటకాభివృద్ధికి పటిష్టమైన అడుగులు పడుతున్నాయని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి వెల్లడించారు. బుధవారం మండల పరిధిలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన ఎత్తిపోతల జలపాతం వద్ద ఏపీ టూరిజం, రెయిన్ బో ఎంటర్టైన్మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిప్ రైడ్, జిప్ సైక్లింగ్ కార్యకలపాలను జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే ప్రారంభించారు. సాహసవంతమైన రైడ్ ను పచ్చజెండా ఊపి, పర్యటకులను ప్రోత్సహించారు. అనంతరం గ్రామీణ బ్యాంకు వారి సౌజన్యంతో నాగార్జునకొండ మ్యూజియానికి సుమారు రూ.16 లక్షల విలువైన రెండు బ్యాటరీ వాహనాలను అందజేయగా వాహనాలను ప్రారంభించారు.

**చారిత్రాత్మక వారసత్వ సంపద అభివృద్ధే ధ్యేయం -- ఎమ్మెల్యే జూలకంటి**చారిత్రాత్మక పల్నాడు ప్రాతంలో వారసత్వ సంపదను అభివృద్ధి చేయడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే జూలకంటి చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు సారధ్యంలో పర్యాటకాభివృద్ధి పరుగులు పెడుతోందని చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గంలో విజపురిసౌత్ ను అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారీగా నిధులు మంజూరు చేస్తున్నాయని వెల్లడించారు. స్వదేశ్ దర్శన్ 2.0 పథకం కింద విజయపురిసౌత్ వద్ద రూ. 25 కోట్లతో బౌద్ధ వారసత్వం, సాంస్కృతిక అనుభవాన్ని పెంపొందించడానికి బెస్ట్ డిస్టినేషన్ డెవలప్మెంట్ గా ఈ ప్రాంతాన్ని పర్యటకంగా తీర్చిదిద్దుతున్నామని వివరించారు. సాగర్ వద్ద బౌద్ధ వారసత్వ కట్టడాలు, ఉద్యానవనాలు, చారిత్రాత్మక చిహ్నాల నిర్మాణం, అనుపు వద్ద పర్యాటక సదుపాయాల మెరుగుదల, 3డి హోలోగ్రామ్ సిస్టమ్, లైవ్ఇంటరాక్టివ్ టచ్ స్క్రీన్ వంటి సదుపాయాలను అందుబాటులోకి తీసుకొస్తున్నామని తెలిపారు. చంద్రబాబు తీసుకొచ్చిన పబ్లిక్.., ప్రైవేటు పార్టనర్ షిప్ విధానంలో అన్ని రంగాలు అభివృద్ధిని సాధిస్తున్నాయని,ఏపీ పర్యటకాభివృద్ధి శాఖ ఈ అవకాశాలను అందిపుచ్చుకోవడం శుభపరిణామని అన్నారు. రెయిన్ బో ఎంటర్ టైన్ మెంట్స్ సంస్థ ఎత్తపోతలలో రూ. 1 కోటి 71 లక్షలతో నిర్మించిన జిప్ రైడ్, జిప్ సైక్లింగ్ కార్యకలపాలను పర్యటకులు సద్వినియోగపర్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గురజాల ఆర్డీవో మురళీ, తహశీల్దార్ కిరణ్ కుమార్, టూరిజం డీఎం కృష్ణచైతన్య, డీటీవో నాయుడమ్మ, యూనిట్ మేనేజర్ బ్రహ్మయ్య, రెయిన్ బో ఎంటర్టైన్మెంట్ ప్రతినిధులు ఖాజా మొయిద్దీన్, జెస్టిన్ జోసఫ్ , కూటమి పార్టీల నాయకులు గుండాల శ్రీను, రాజబోయిన మధు, వీరాస్వామి, సుధాకర్ రెడ్డి, సైదారావు,గోపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విగ్రహాలను నిర్దేశించిన ప్రదేశాల్లో నిమజ్జనం చేయాలి



గుంటూరు.సెప్టెంబర్ 09రాజధాని వాయిస్ : విగ్రహాలను నిర్ణయించిన నిర్దేశిత ప్రత్యేక నిమజ్జన ప్రదేశాల్లో మాత్రమే నిమజ్జనం చేయాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ పిలుపునిచ్చారు. ఈ మేరకు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ( సిపిసిబి) విగ్రహాల నిమజ్జనానికి సంబంధించి మార్గదర్శకాలను జారీ చేసిందని, వాటిని పాటించి పర్యావరణ హితానికి తోడ్పాటును అందించాలని బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో కోరారు. సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించిన అనంతరం విగ్రహాలను జలాశయాలు, నీటి వనరుల్లో నిమజ్జనం చేయడం జరుగుతుందని, తద్వారా నీటి నాణ్యత దెబ్బతింటుండటం ఆందోళనకరమైన అంశంగా ఉందన్నారు. క్లాస్-1 నగరాల పరిధిలో నీటి వనరుల నీటి నాణ్యతను మూడు దశల్లో - నిమజ్జనానికి ముందు, నిమజ్జనం జరుగుతున్న సమయంలో, నిమజ్జనం అనంతరం పర్యవేక్షించి అంచనా వేయాలని సూచించడం జరిగిందని వివరించారు. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి మార్గదర్శకాల్లో ముఖ్యంగా పర్యావరణహిత విగ్రహాలను ఉపయోగించాలన్నారు. రంగులు వినియోగిస్తే పర్యావరణ హిత రంగులు మాత్రమే వినియోగించాలని అన్నారు. అవసరమైన సౌకర్యాలతో తాత్కాలికంగా ప్రత్యేక నిమజ్జన కొలనులను ఏర్పాటు చేయవచ్చని చెప్పారు. వినాయక మండపాలు నిర్వహించే వర్గాలతో సహా ప్రజలకు విస్తృత అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. విగ్రహాల నిమజ్జనం సందర్భంగా నీటి నాణ్యత దెబ్బతినకుండా నివారించుటకు సి.పి.సి.బి మార్గదర్శకాలను అమలు చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# మంగళగిరిలో నారా లోకేష్ ప్రజాదర్బార్

- పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రజలతో ముఖాముఖి
- వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వినతులు స్వీకరణ
- సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చిన మంత్రి







రాజధాని వాయిస్ :మంగళగిరి, సెప్టెంబర్ 09 : మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ప్రజాదర్బార్ నిర్వహించారు. ఉదయం నుంచే కార్యాలయానికి పెద్ద సంఖ్యలో ప్రజలు, కార్యకర్తలు, నాయకులు తరలివచ్చారు. వారితో మంత్రి నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను వినతి పత్రాల రూపంలో మంత్రికి అందజేశారు. విద్య, ఉద్యోగాలు, స్థానిక అభివృద్ధి పనులు, వ్యక్తిగత సమస్యలకు సంబంధించి అనేక విజ్ఞప్తులు వచ్చాయి. ప్రతి ఒక్కరి వినతిని మంత్రి స్వయంగా స్వీకరించి, చదివి అర్థం చేసుకున్నారు.ప్రజల నుంచి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. సంబంధిత అధికారులకు ఫోన్ చేసి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించగా, మరికొన్నింటిని త్వరితగతిన పరిష్కరించేలా హామీ ఇచ్చారు. ప్రజాదర్బార్ ద్వారా ప్రజలకు నేరుగా అందుబాటులో ఉండటం తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు కూడా ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజాదర్బార్ కు వచ్చిన ప్రజలు మంత్రిని కలవడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

## వైకాపా నేతల ఆధ్వర్యంలో కాసు మహేష్ రెడ్డి జన్మదిన వేడుకలు



పిడుగురాళ్ల.సెప్టెంబర్ 09రాజధాని వాయిస్ :గురజాల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి జన్మదిన వేడుకలు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు ఆయనను కలిసి కేక్ కట్ చేయించి, పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాసు శ్రీకాంత్ రెడ్డి, లోకల్ యూత్ నాయకుడు గొట్టిముక్కల పవన్ రెడ్డి, పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా అధ్యక్షుడు గొట్టిముక్కల మట్టారెడ్డి, జిల్లా పబ్లిసిటీ వింగ్ ఉపాధ్యక్షుడు మిట్టా జంగమయ్య, మైనారిటీ నాయకుడు షేక్ పెంటు, మాచవరం రామారావు తదితరులు పాల్గొన్నారు.

## ధరల పెరుగుదలపై కారంపూడిలో సీపీఐ ధర్నా



కారంపూడి.సెప్టెంబర్ 09రాజధాని వాయిస్ : నిత్యావసర సరుకులు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం కారంపూడి బస్టాండ్ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి షేక్ సైదా మాట్లాడుతూ, పెరిగిన ధరలతో పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే ధరలను నియంత్రించకపోతే పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి ఆర్‌ఐ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి మేకపోతు చిన్న కోటిరెడ్డి, పట్టణ కార్యదర్శి సూరె హనుమంతరావు, నాయకులు గాలం శ్రీను, నూనె వెంకటేశ్వర్లు, వరలక్ష్మి, జాన్ బి, సైదా బి తదితరులు పాల్గొన్నారు.

## 12న కేసీపీ ఆధ్వర్యంలో ఉచిత ప్రత్యేక వైద్య శిబిరం



మాచర్ల.సెప్టెంబర్ 09రాజధాని వాయిస్ : కేసీపీ సంస్థల చైర్‌పర్సన్ డాక్టర్ వెలగపూడి ఇందిరాదత్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని, రోటరీ క్లబ్ ఆఫ్ మాచర్ల సహకారంతో మహిళల కోసం ఈ నెల 12వ తేదీ శనివారం ఉచిత ప్రత్యేక క్యాన్సర్ వైద్య పరీక్షల శిబిరం నిర్వహిస్తున్నట్లు కేసీపీ సీనియర్ జనరల్ మేనేజర్ వి. వెంకటరమణ తెలిపారు. కేసీపీ జనరల్ స్టోర్ పక్కన ఉన్న వెలగపూడి లక్ష్మణ దత్ ఆడిటోరియంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగే ఈ శిబిరంలో బసవతారకం ఇండో--అమెరికన్ క్యాన్సర్ సంస్థ నిపుణులు మహిళలకు ఉదరం, రొమ్ము, గర్భాశయ పరీక్షలతో పాటు ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్ స్కానింగ్, పాప్ స్మియర్, మెమోగ్రఫీ తదితర ఖరీదైన పరీక్షలను పూర్తిగా ఉచితంగా అందించనున్నారు. మహిళలు తమ ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతితో హాజరై ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేసీపీ హెచ్‌ఆర్ ఉదయ్ కుమార్, విభాగాల అధిపతులు, రోటరీ క్లబ్ మాచర్ల అధ్యక్షులు పఠాన్ నాగూర్ వలి, ట్రెజరర్ ఆవుల వెంకట వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## జి.ఎం.సి కమిషనర్‌ను అభినందించిన కలెక్టర్



గుంటూరు.సెప్టెంబర్ 09రాజధాని వాయిస్ :వాయు కాలుష్య నియంత్రణలో విశేష ప్రతిభ కనబరిచి, కేంద్ర పర్యావరణ శాఖ నిర్వహించిన 'స్వచ్ఛ వాయు సర్వేక్షణ్'2026లో గుంటూరు నగరం ప్రతిష్ఠాత్మక జాతీయ పురస్కారాన్ని దక్కించుకున్న సంగతి తెలిసిందే. ఈ అవార్డును అందుకున్న గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె.మయూర్ అశోక్ ను బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ అభినందించారు. దేశ వ్యాప్తంగా 130 నగరాల మధ్య జరిగిన పోటీలో గుంటూరు నగరం పట్టణాల కేటగిరిలో ద్వితీయ స్థానంలో నిలవడం గర్వకారణం అన్నారు. రాష్ట్ర స్థాయి కేటగిరీ 2 లో జిఎంసి తొలి స్థానంలో నిలిచింది. పర్యావరణ పరిరక్షణలో కృషి చేస్తూ మరిన్ని అవార్డులు సాధించాలని ఆకాక్షించారు. గ్రీన్ గుంటూరు, నవ గుంటూరును సాధించి ప్రజల మనసులో నిలవాలన్నారు.

PRINTED, PUBLISHED AND OWNED BY PAGALA PURNA CHANDRA RAO. MUTUKURU (POST) DURGI MANDAL MACHERLA CONSTITUENCY. PALNADU DISTRICT.AP.DOOR N0 0-004 PINCODE 522612 PHONE NUMBER 9030343195. PRINTED AT SRI KANAKA BHARGAV OFF-SET PRINTERS. MAIN ROAD ANJANEYA COLONY REDDYPALEM GUNTUR 522009 ANDHRA PRADESH . EDITOR :PAGALA PURNA CHANDRA RAO
RNI NO :APTEL/2023/90201PHONE NUMBER : 9030343195.EMAIL. rajadhanivoicedaily@gmail.com